# ప్రేమకు చావు లేదు

ఇది కల్పితం కాదు. జరిగింది. జరుగుతూ వుంది. జరుగుతుంది.

ఎందుకు?

భూమి, బువ్వ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం బ్రతకటానికి, పీడన, దోపిడీ వదిలించుకోవటానికి.

ఎక్కడ?

ఇక్కడ, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లా దేశ్, నీఫా, పంజాబ్, ఆఫ్రికా, అమెరికా, ఆసియా, ఐరోపా, ఆస్ట్రేలియా ఎక్కడయినా.

ఎప్పుడు?

నిన్న, నేడు, రేపు ఎప్పుడయినా

బస్‌స్టాండ్, బల్లమీద యువతి. రాశిపోసిన అందం. వయస్సు తెచ్చిన నిగారింపు. 36500 సూర్యుళ్ళను ఏ రోజుకారోజు ఎత్తి ముద్దాడే చైతన్యం.

ఎదురుగా యువకుడు. చువ్వ. చుక్క కాగడా, బంగారు కడ్డీ. ఎర్రదనం దాస్తున్న నల్లదనం. సూర్యుణ్ణి కమ్మిన చీకటి. పిల్లి గడ్డం.

బ్రీఫ్ కేసును యువతి కూర్చున్న బల్లకు చైన్ వేసి కట్టాడు.

'ఇటురా' పిలిచాడు. అపరిచితుడు. యువతి లేచింది. అతను నడుస్తున్నాడు. వెంట నడచింది మత్తు మందు చల్లినట్లు.

"ఎవరు నువ్వు?" అడిగింది.



"మాట్లాడాలి" చెప్పాడు.

"ఏమని?"

"బిచ్చగాళ్ళు ఇష్టమా?"

"కాదు"

"వాళ్ళతో ఎందుకూర్చున్నావ్?"

"వాళ్ళే వచ్చి కూర్చున్నారు?"

అంతలో నిశ్శబ్దం పగిలినట్లు బస్ స్టాండ్ బల్లలకింద శబ్దం. మూడు.

"నువ్వు కూర్చున్న బల్ల పేలిపోయింది. నీ కాలికింది నేల కుంగిపోయింది. నీ నెత్తిమీది కప్పు లేచి పోయింది.

బస్‌స్టాండ్‌లో పొగ, ఏడుపులు, గోల, అటు చూచి, ఇటు తిరిగేసరికి యువకుడు లేడు. ఏమయ్యాడు? ఎటుపోయాడు? అందం కదిలినట్లు వచ్చాడు. యౌవనం పిలిచినట్లు పలకరించాడు. వెలుతురులాగా ఎదుట వున్నాడు. బాంబులు పేలిన చోట సంచిలోని తన చీరలు పేలికలయ్యాయి. బిచ్చగాళ్ళ శరీరాలు ముక్కలయ్యాయి.

బస్‌స్టాండ్ కాలిపోయిన బస్సులాగా వుంది.

బిచ్చగాళ్ళ శరీరాలులాగా తన శరీరం అతను బతికించి - ఏడి?

'అందం చావదు, దారిద్ర్యం బతకదు' అని ప్రకటన. దినపత్రిక ఎడం పక్క పైమూల మీద కాంట్రాక్టు స్థలంలో ప్రకటన.

నువ్వు అందం. బిచ్చగాళ్ళు దారిద్ర్యం. అందమంటే శ్రమశక్తి. ఉత్పత్తి శక్తి. పునరుత్పత్తి శక్తి.

దారిద్ర్యం ఉత్పత్తి శక్తి కాదు. పునరుత్పత్తి శక్తి కానక్కరలేదు.

పుట్టినవాడికి బ్రతికే హక్కు వుంది. మరెందుకీ కార్లు, కాల్పులు, ఎన్‌కౌంటర్లు. అందుకే బాంబులు.

ఎక్కడ బాంబులు? జనం వుండే చోట. ఎందుకు? వార్నింగ్, దేనికి? ప్రభుత్వానికి ఏమని? దోపిడీ మాననుని, విలువల్ని కాలరాయవద్దని.

బాంబులు పేలితే జనం చస్తారు. జనం కంటే బిచ్చగాళ్ళు చచ్చిపోతే మేలు.

ప్రయోజనం? యాచన వుండదు. ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రోత్సహించటం. పని చేయని సోమరులు బిచ్చం వేసి ముక్తి పొందవచ్చుననుకొనే అవకాశం వుండదు. శ్రమించే జనం కంటే బిచ్చగాళ్ళు చస్తే మేలు.

వాళ్ళ మీద ఆధారపడేవాళ్ళు వుండరు. వాళ్ళకూ విముక్తి. వాళ్ళను పోషించే స్వార్థపరుల బిచ్చానికి విముక్తి. ఎందుకున్నారు బిచ్చగాళ్ళు? దారిద్ర్యం! ఎవరు సృష్టించారు దారిద్ర్యం? ప్రభుత్వం.

దారిద్ర్యం వల్లే అడుక్కోవటం. నిజానికి అడుక్కోవటం కంటే దారిద్ర్యం లేదు.

దారిద్ర్యం అంతరించాలి. అందం జీవించాలి. నువ్వు బతికావు. బిచ్చగాళ్ళు

చచ్చిపోయారు. వార్నింగ్ ఏం మార్పు తెస్తుందో చూడాలి.

షరా: నువ్వేమన్న రాస్తే ఈ పత్రికకే పంపు. ఈ జాగాలోనే ముద్రిస్తారు. ఇది కాంట్రాక్ట్.

యువతి ఆ ప్రకటన లోకం కోసమే కాదు. తన కోసం కూడా.

మరునాటి దినపత్రికలో అదే చోట ప్రకటన.

ఎక్కడ? ఎలా?యువతి.

అదే చోట ప్రకటన

ఫలానా చోట. ఫలానా రోజు. ఫలానా టైం. వస్తాను. తీసుకుపోతాను. సిద్ధంగా వుండు.

కానీ మాకు - మనకు నిలకడ వుండదు. తిండి వుండదు, బట్ట వుండదు. ఇల్లు వుండదు. ఇవన్నీ లోకానికి వుండాలనుకొనే మాకు ఇవేవీ వుండవు.

ఏది మృత్యువో, ఏది బ్రతుకో తెలియదు.

కానీ ఉత్సాహం వుంటుంది. ఉద్వేగం వుంటుంది. ఈ బ్రతకులు మారతాయని ఆశ వుంటుంది. మారుద్దామన్న ఆశయం వుంటుంది. ఇష్టమేనా? సిద్ధమేనా? రెడీ?

ప్రకటన

అంత విశాలమయిన జాగాలో ఒకే ఒక్క మాట.

'రెడీ!'

ఆ చోట, ఆరోజు ఆ టైంకు యువతి వచ్చి కూర్చుంది.

అది ప్లాటుఫారం. రైలు ఆలస్యం. జనం క్రిక్కిరిసి వున్నారు. ప్రయాణీకుల కంటే పోలీసులు ఎక్కువ. డ్రెస్‌లో తక్కువ. మఫ్టీలో ఎక్కువ.

ఈ దేశంలో అతి వేగంగా నడిచే, ఛార్జీలెక్కువ, సంపన్నులు ఎక్కే, ఎ.సి రైలు వచ్చే టైం.

యువతి బల్ల మీద కూర్చుంది. ఎవరు వస్తున్నా అతనే వస్తున్నాడని చూస్తూ వుంది.

రాలేదు.

ఇంత మంది పోలీసులు, లోకల్,రిజర్వ్, బి.ఎస్.ఎఫ్. సి.ఆర్.పి కమెండోలు, ఆమెకు భయం లేదు.

ఎలా రాగలడు?

అతను రాలేదు.

బిచ్చగాళ్ళు - సర్వాంతర్యాములు, కొదవ లేదు.

'అమ్మా ధర్మం!'

యువతి బిచ్చం వేయదు, దానం చేయదు.

'అమ్మా ధర్మం!'

బిచ్చగాడుంటే బాంబుంటుంది.

యువతి భావించింది.

పాపం ముసిలోడు. ఎట్టా బ్రతుకుతాడు. చచ్చి పోతాడు కాబోలు.

'అమ్మా ధర్మం?'

'లేదుపో'

'చూద్దాం సారీ! వచ్చినందుకు థాంక్స్!'

బిచ్చగాడి మాటలు అర్థం కాలేదు.

అతను వెళ్ళిపోయాడు.

ఆ మాటలు అర్థం కాసాగాయి. అంతలో అదృశ్యమయ్యాడు.

'అతనొచ్చాడు!' అనుకొంది. అంది. జనానికి పిచ్చిది పోలీసులకు మంచిది.

"ఏడి?" పోలీసు అడిగాడు.

"ఏడి?" యువతి ప్రశ్నించింది.

టైం చూచింది. కరెక్టు టైం.టైం ప్రకారం వచ్చాడు.

రైట్ టైం. రైలు వస్తూ వుంది. రైల్ అవుటర్‌లో. అక్కడే శబ్దం ప్రమాదం ఇంజన్ పేలిపోయింది. బోగీలు ఒకదానిమీది కొకటెక్కాయి.

ప్రకటన

చిన్న వార్నింగులు ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. పెద్ద వార్నింగులు అవసరమవుతున్నాయి. అది సంపన్నుల రైలు, సామాన్యులది కాదు. సంపన్నులు సోమరులు. ఉత్పత్తి చేయరు. దోచుకొంటారు వీళ్ళు. ఆ పాతిక కుటుంబాల వాళ్ళు. లక్షల్లో వున్నారు.

సంపన్నులు చస్తే ప్రభుత్వంలో సంచలనం రాకపోదు.ఇక వాళ్ళు ప్రభుత్వం దృష్టిలో అమర వీరులు . వాళ్ళకు జోహర్లు పలుకుతుంది. ప్రభుత్వం.

షరా: నువ్వాగు.

మరునాడు ప్రకటన

నేనాగను. నీతో వస్తా! నువ్వు రావద్దు. నేనే వస్తా! ఎప్పుడు, ఎక్కడ, ఎలా, తెలియజెయ్

ప్రకటన

వస్తాను. కలసి జీవిద్దాం. బ్రతికి వుంటే మనం కలసి వుంటాం. లేకపోతే లోకమంతా నాలాంటి వాళ్ల వందలు, వేలు, లక్షలు, కోట్లు వుంటారు. నువ్వు చూడగలిగితే నేను ఎప్పుడైనా ఎక్కడైనా, ఎలాగైనా కనిపిస్తాను.

ప్రకటన లేదు. పత్రికలో ఆ జాగా ఖాళీ! వారం గడిచింది. యువతి నిరీక్షిస్తూ వుంది. ఒకరోజు ప్రకటన.

ప్రజాస్వామ్యం ప్రజలది కాకుండా పోయింది. దొంగలు, హంతకులు, దుర్మార్గులు ప్రజాకంటకులు పాలకులవుతున్నారు. ప్రజల అవసరాలు తీరటం లేదు. పాలకుల స్వార్థం పండి ఫలిస్తూ వుంది. ఈ ప్రజాస్వామ్యం మృత్యువు.

ఎన్నికలు వద్దన్నా నిషేధించినా, భయపెట్టి, చంపి, కండబలంతో తుపాకీ మొనతో ఓట్లు పడుతున్నాయి. పోలీసులు చూస్తుండగా ఎన్నికలు జరిగిన దాఖాలా!

దుర్మారంగా ఎన్నికైన హంతకులు లేకుండా పోతే తప్ప, పీడన, దోపిడీ ఆగవు.హంతకుడు సృష్టి కాకూడదు. వాళ్ళకు అధికారం రాకూడదు. వాళ్ళు ఎన్నికలలో నిలబడకూడదు.

సామాన్యులు పాలకులు కావాలి. వాళ్ళు మళ్ళీ అధికార గర్వంతో హంతకులు కారాదు. ఎవరికీ ఎక్కువ అధికారం వుండరాదు. అధికారం కేంద్రీకృతం కారాదు. ఒక్కడి చేతిలో అన్ని అధికారాల పగ్గాలుండరాదు.

షరా: 'నువ్వంటే నాకు ప్రేమ'

ప్రకటన

'నేను ప్రేమిస్తున్నాను. హింసించలేను నీ పని హింస, నువ్వు కూడా ప్రేమించగలవా?'

ప్రకటన.

'ప్రేమించగలను. అందుకు మరణించగలను. ప్రేమిస్తున్నాను కాబట్టి మరణిస్తున్నాను.'

ఈ ప్రకటనలు ఎవరూ పట్టించుకోలేదు. ప్రేమ లేఖలుగా భావించారు.

యువతి వార్తలు కంటే ఈ ప్రకటనే ఇష్టంగా చదువుతుంది. వార్తలు రకరకాలుగా వస్తున్నాయి.

ప్రజానాయకులు శాసనం చేసే సభలో సమావేశమై అతి ముఖ్యమైన సమస్య మీద నిర్ణయం తీసుకోబోతున్నారు.

అది ప్రజాద్రోహమని సమ్మెలు జరిగాయి. బంద్‌లు జరిగాయి. కాల్పులు జరిగాయి. ప్రజలు చనిపోయాడు.

శవాల ఊరేగింపు

శాసనాధికారుల సమావేశం

అది ఆసక్తి రేకెత్తించింది. సామాన్యుల ఆందోళన

సంపన్నుల ఆనందం.

విచిత్రం. సంపన్నులకే కాదు. బిచ్చగాళ్ళకు కూడా ఆ సమావేశం ఉత్సాహం కలిగించింది. జోలెగాళ్ళు బిచ్చగాళ్ళు విజిటర్సుగా వచ్చారు.

అంతా అనుకూలంగా, ఏమీ వ్యతిరేకత లేకుండా అన్ని రాజకీయ పక్షాల వాళ్ళు ఏకగ్రీవంగా శాసనం చేయటానికి చేతులెత్తటానికి సిద్ధంగా ఉన్నారు.

బిచ్చిగాళ్ళు కాళ్ళెత్తారు. ఒక యువకుడు, మరో వృద్ధుడు ఇద్దరూ బిచ్చగాళ్ళే. సభలోకి దూకారు. వెంటనే రెండు పేలుళ్ళు. సభలో పొగ గోల.

యువతి వార్తలు చదవలేదు. ప్రకటన చదివింది.

"ప్రేమకు చావులేదు"

అదే ఆ యువతి ఆ జాగాలో చదివిన చివరి ప్రకటన

ఆ పత్రికలో ఆ స్థలంలో ఇక ప్రకటనలు లేవు. అక్కడ అంతా ఖాళీగా, తెల్లగా స్వచ్ఛంగా, వెలుగులా, సూర్యోదయంలా వుంది.

★